# సాక్షి ప్రకాశం

ఆదివారం । 11 । జూన్ । 2023






**సముద్రంలో గల్లంతై ఇద్దరు మృతి**

ఒంగోలుకు చెందిన ఇద్దరు యువకులు ఈతముక్కల సముద్ర తీరంలో ఈతకు వెళ్లి నీటిలో గల్లంతై మృత్యువాత పడ్డారు.

- 8లో..



**సీఎం జగన్‌తోనే సంక్షేమ పాలన**

సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమ పాలన సాధ్యమని మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
42 /28

**వాతావరణం**

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు అధికం. ఉక్కపోతగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి.

## న్యూస్‌రీల్

### యర్రగొండపాలెంలో కలెక్టర్ స్పందన

ఒంగోలు అర్బన్: ప్రతి సోమవారం కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నిర్వహించే స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని 12వ తేదీ యర్రగొండపాలెంలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం దగ్గర ఉన్న బాబు జగ్జీవనరావు–అంబేడ్కర్ ఆడిటోరియంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

### డీసెట్ కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ రేపు

ఒంగోలు: డీసెట్ 2023కు సంబంధించిన కంప్యూటర్ బేస్డ్ ప్రవేశ పరీక్ష ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ కాలేజీ (నాయనపల్లి వేటపాలెం మండలం)లో నిర్వహిస్తున్నట్లు డీఈవో పి.రమేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారన్నారు. అభ్యర్థులు హాల్‌టికెట్లను హెచ్‌టీటీపీఎస్://ఏపీడీసెట్.ఏపీ.సీఎఫ్ఎస్ఎస్.ఇన్ అనే వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఏవైనా సందేహాలుంటే కాంటాక్ట్ నంబర్ 8125264606ను సంప్రదించాలన్నారు.

### ఉత్సాహంగా రాష్ట్ర స్థాయి పోలురాథాడి పోటీలు

అల్లూరు (కొత్తపట్నం): గ్రామీణ ప్రాంతాల్లో పశువులు అంతరించిపోతున్న తరుణంలో ఎడ్ల రాథాడి పోటీలు ఎంతో అవసరమని ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి అన్నారు. రాష్ట్ర స్థాయి జూనియర్ పోలురాథాడి పోటీలు ఆకుల అల్లూరు గ్రామంలో శనివారం ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయుకుడు వీరేపల్లి రామచంద్రారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు మిట్నసల శాంతారావు, శింగమనేని చంద్రశేఖర్‌రావు ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ తాటిపర్తి సుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ స్వర్ణ శివారెడ్డి, శింగమనేని చంద్రశేఖరరావు, పశుపోషక రైతులు పాల్గొన్నారు.

# చికెన్ ముక్కదిగట్లా..!

మీరు చికెన్ ప్రియులా..
అయితే మీకు ఇది బ్యాడ్‌న్యూస్..మార్కెట్లో చికెన్ రేట్లు కొండెక్కి కూర్చున్నాయి..ఎంతంటే చికెన్ అంటే భయపడేటట్టుగా..వారం రోజుల వ్యవధిలో రేట్లు భారీగా పెరిగాయ్. ఒక వైపు 43 డిగ్రీలు దాటి సెగపుట్టిస్తుంటే.. మరో వైపు కోడి మాంసం ధర రూ.310 దాటి నాన్‌వెజ్ తినేవారికి షాక్ ఇస్తున్నాయి. ఇరవై ఏళ్లలో కనీవినీ ఎరుగని రీతిలో ధరలు పెరిగి అబ్బా బ్రాయిలర్ నుంచి బాబోయ్ అనే పరిస్థితికి చేరింది. ఇలా అయితే గొంతులోకి చికెన్ ముక్క దిగేది కష్టమేనంటున్నారు మాంసం ప్రియులు.
ఇక గుడ్డు దారీ అదే..
రిటైల్‌లో ఒకటి రూ.7 దాటింది.

- చుక్కలనంటిన కోడి మాంసం ధర
- కిలో రూ.300 మార్కు దాటిన ధర
- సామాన్యుడికి అందనంతగా పెరిగిన వైనం
- వేసవి తాపం.. కోళ్ల నిర్వహణ ఖర్చు పెరగటమే కారణం
- గుడ్డు ధరకు కూడా రెక్కలొచ్చె
- రిటైల్‌లో ఒక్కొక్కటి రూ.7కు పైగా..
- నోరెళ్లబెడుతున్న మాంసం ప్రియులు



ఒంగోలు సబర్బన్:

భానుడి ప్రభావంతో పౌల్ట్రీ ఫాం విల విల్లాడి పోతోంది.. కోడి మాంసం ధర చుక్కలనంటుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా కోడి మాంసం ధర పెరిగింది. దాదాపు ఈ ఒకటి, రెండు దశాబ్దాలలో ఎన్నడూ కిలో బ్రాయిలర్ కోడి మాంసం ధర రూ.300లకు మించలేదు. అలాంటిది ప్రముఖ పౌల్ట్రీ కంపెనీలే కిలో రూ.310 ప్రకటించాయి. ఆదివారం వస్తే చికెన్ తినాలన్న ఆశను కూడా చంపుకుంటున్నారు. నాన్‌వెజ్ ప్రియులకు చటుక్కున గుర్తు కొచ్చేది కోడి గుడ్డు, కోడి మాంసం. ఆ తరువాతి స్థానం చేపలది. ధరలు భారీగా పెరగడంతో అందరి చూపు మత్స్య సంపద వైపు మళ్లుతోంది.

**జిల్లాలో రోజుకు 20 లక్షల కిలోల టర్నోవర్...**

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో రోజుకు రమారమి 20 లక్షల కిలోల కోళ్ల టర్నోవర్ జరుగుతోంది. అదే ఆదివారం వచ్చిందంటే దాదాపు 30 లక్షలు దాటుతుంది. గృహ వినియోగంతో పాటు పార్టీలు, ఫంక్షన్‌లు ఇలా అన్ని రకాలు కోడి మాంసం పైనే ఎక్కువగా ఆధారపడుతున్నారు. సాధారణ రోజుల్లో 20 లక్షల కిలోల కోళ్లు అంటే కిలో రూ.300 చొప్పున వేసుకున్నా రోజుకు రూ.6 కోట్ల టర్నోవర్ అను నిత్యం సాగుతోంది. అదే ఆదివారం వచ్చే సరికి మరో రూ.2 కోట్లు అదనం అన్నమాట. ఇక గుడ్లు కూడా అదే పరిస్థితి. హోల్‌సేల్‌లో గుడ్డు ధర రూ.6 పలుకుతోంది. రిటైల్‌లో అదికాస్తా రూ.7 దాటుతోంది. ప్రతి రోజూ ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 40 నుంచి 45 లక్షల గుడ్ల విక్రయాలు జరుగుతున్నాయి. గుడ్లకు సాధారణ రోజులు, ప్రత్యేకంగా ఆదివారం అంటూ ఏమీ ఉండదు.

**వేసవి తాపమే కారణం...**

భానుడి తీవ్రత కొన్ని రోజులుగా చండ ప్రచండంగా మారింది. రోజూ 40 నుంచి 43 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో బ్రాయిలర్ కోళ్లు ఉక్కిరి బిక్కిరి అవుతున్నాయి. వేడి నుంచి కోళ్లను కాపాడటానికి కూలర్లు కూడా పెట్టాల్సిన పరిస్థితి. షెడ్లను గడ్డితో కప్పి నీటితో తడపాల్సి వస్తోంది. దీంతో నిర్వహణ ఖర్చులు అమాంతం పెరిగిపోయాయని ఫారాల నిర్వాహకులు లబోదిబోమంటున్నారు. దీనికితోడు మొక్కజొన్న ఫీడు ధరలు సైతం పెరగటం మరో కారణంగా చెబుతున్నారు.

**మొదటి కరోనా సమయంలో కోడి రూ.10 మాత్రమే:**

కోళ్ల పరిశ్రమ అదఃపాతానికి వెళ్లిన సందర్భాలు రెండే రెండు. ఒకటి చికున్ గున్యా వచ్చినప్పుడు. రెండోది మొదటి కరోనా సమయం. చికున్ గున్యా సమయంలో కోడి మాంసం తింటేనే చికున్ గున్యా వస్తుందని భావించి దాదాపు 80 నుంచి 90 శాతం ప్రజలు తినటం మానుకున్నారు. దీంతో బతిమిలాడి మరీ షాపుల నిర్వాహకులు అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఆ తరువాత 2019లో మొదటిసారి కరోనా వచ్చినప్పుడు కోడి మాంసం తినకూడదు అన్న ప్రచారం జోరుగా సాగింది. దీంతో రూ.100లకు మూడు కిలోలు కోడి మాంసం ఇచ్చిన సందర్భాలూ ఉన్నాయి. ఒక్కో రోజు అయితే కోడి రూ.10లకు కూడా ఇచ్చేశారు.

**ఏసీలో కోళ్లను పెట్టాల్సిన పరిస్థితి**



ఈ వేసవికి కోళ్లను కాపాడటం గగనంగా మారింది. కోళ్లను పెంచటం మొదలుకొని రవాణా చేసే సమయం నుంచి వాటికి అత్యంత వేడి తగలకుండా చూసుకోవాలి. దీంతో ఖర్చులు బాగా పెరిగిపోతున్నాయి. ఒక్కో సీజన్‌లో కోళ్ల ధరలు ఒక్కోరకంగా హెచ్చు తగ్గులు ఉంటుంటాయి. గతంలో చికున్ గున్యా సమయంలో నష్టాలపాలయ్యాం. ఇప్పుడు ఖర్చులు పెరిగినందు వల్లే ధర పెంచాల్సిన పరిస్థితి ఏర్పడింది.
– రంగబాబు, ఆర్‌ఆర్ చికెన్ ఫామ్స్, పాత మార్కెట్

**కూలర్ల ద్వారా కాపాడుతున్నాం...**



ఫారమ్‌లో వేడి నుంచి తట్టుకోవటానికి కూలర్లు ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి. షెడ్ల మీద గడ్డి, జమ్ము లాంటి వాటిని వేసి నీళ్లతో తడపాల్సి వస్తోంది. ఇక రవాణాతో పాటు నిల్వ చేసుకోవటానికి కూడా ఖర్చులు పెరిగిపోయాయి. వేసవి వల్ల ఈ పరిస్థితులు ఏర్పడ్డాయి. గతంలో ఎన్నడూ లేనంతగా ధర హోల్‌సేల్‌లోనే పెరిగి పోయింది. ఒక్కో సీజన్‌లో కోడిని రూ.10కి కూడా అమ్మాల్సిన పరిస్థితులను ఎదుర్కొన్నాం. కరోనా సమయంలో రూ.100 మూడు కిలో కోడి మాంసం ఇచ్చిన సందర్భాలు ఉన్నాయి.
– జీఎస్.సతీష్ కుమార్, ఏపీ పౌల్ట్రీ ఫామ్స్, కొత్త మార్కెట్

### హెచ్‌ఎంలు సరుకులు తీసుకోవాలి

ఒంగోలు: పాఠశాలలు సోమవారం నుంచి పునః ప్రారంభం అవుతున్న దృష్ట్యా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మిడ్ డే మీల్స్ సరుకులు రేషన్ దుకాణాల నుంచి తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బియ్యం, రాగిపిండి, బెల్లం రేషన్ దుకాణదారుడ్ని సంప్రదించి తీసుకోవాలన్నారు. అందుబాటులో లేకుంటే కుకింగ్ ఏజెన్సీ వారు బయోమెట్రిక్ ద్వారా స్టాక్‌ను ఆదివారం సాయంత్రంలోగా తీసుకోవాలని, కోడిగుడ్లు, చిక్కీ తీసుకోవడానికి ప్రధానోపాధ్యాయులు లేదా పాఠశాల సంబంధిత సిబ్బంది పాఠశాలలో తప్పనిసరిగా ఉండాలన్నారు. పాఠశాలలు పునఃప్రారంభం దృష్ట్యా ఏ పాఠశాలలో అయినా మధ్యాహ్న భోజన పథకం మెనూ ప్రకారం అమలు కాకుంటే సీసీఏ నిబంధనల ప్రకారం సంబంధిత ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఈవో పి.రమేష్ హెచ్చరించారు.

### మెడికల్ అండ్ హెల్త్ కాంట్రాక్ట్ ఉద్యోగుల హర్షం

ఒంగోలు టౌన్: కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పట్ల యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లూరి వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.నాగేశ్వర రావు, కె.శ్రీధర్ బాబు శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. 2014 జూన్ 2 నాటికి 5 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారిని రెగ్యులరైజ్ చేయడం సంతోషకరమని, అయితే దీనికి కొద్ది నెలల తేడాతో అనేక మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు అన్యాయానికి గురవుతున్నారని తెలిపారు. 2014 జూన్ 2 కు ముందు నియమితులైన కాంట్రాక్ట్ ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని కోరారు. అలాగే విభజన తరువాత నియమించిన ఉద్యోగులను కూడా రెగ్యులర్ చేయాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.

# చంద్రబాబువి నీచ రాజకీయాలు

- అవినీతి ఆరోపణలను తిప్పికొట్టలేక కొండపి ఎమ్మెల్యే దుర్మార్గపు రాజకీయం
- దళిత మహిళ హత్యకు పూర్తిగా కుటుంబ వివాదాలే కారణం
- ఆమె కుటుంబానికి అండగా ఉంటాం
- పరామర్శల పేరుతో తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదు
- ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పోతుల సునీత



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు పోతుల సునీత

ఒంగోలు: దళిత మహిళ, అంగన్‌వాడీలో విధులు నిర్వహిస్తున్న హనుమాయమ్మ మృతిని అడ్డంపెట్టుకుని చంద్రబాబు నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ పోతుల సునీత విమర్శించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ హత్యకు గురైన హనుమాయమ్మ, ఆమె మృతికి కారణమైన కొండలరావు ఇద్దరూ బంధువులు అన్నారు. 2007 నుంచి ఆ కుటుంబాల మధ్య వివాదాలు నడుస్తున్నాయన్నారు. హత్యకు పూర్తిగా కుటుంబ వివాదాలే కారణమని, అంతే తప్ప దానిని రాజకీయం చేయాలని చూడడం దారుణం అన్నారు. నిందితునిగా పోలీసులు అరెస్టు చేసిన కొండలరావుకు కనీసం ఓటు హక్కు కూడా లేదని, అయినా వైఎస్సార్ సీపీ అంటూ ప్రభుత్వంపై నింద వేయడం వెనుక చంద్రబాబు శవరాజకీయాన్ని స్పష్టం చేస్తుందన్నారు. మరుగుదొడ్ల కుంభకోణం వ్యవహారం వెలికి రావడంతో చంద్రబాబు సైతం దిగ్భ్రాంతికి గురయ్యారని, అయితే పార్టీ ఎమ్మెల్యేను వెనుకేసుకు వచ్చేందుకు నీచరాజకీయాలకు తెరలేపారన్నారు. మరుగుదొడ్ల కుంభకోణం విషయాన్ని వెలికి తీయడంతోపాటు వినూత్న ప్రదర్శనతో వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు నిరసన తెలియజేయడంతో దానిని అడ్డుకునేందుకు పచ్చ బ్యాచ్‌తో కలిసి చొక్కా చించుకుని వైఎస్సార్‌సీపీ నాయకులు దాడి చేశారంటూ చెప్పుకోవడం ఒక ఎమ్మెల్యేకు తగదన్నారు. కేవలం మరుగుదొడ్ల కుంభకోణాన్ని పక్కదారి పట్టించేందుకు హనుమాయమ్మ మరణాన్ని కూడా సాకుగా వాడుకుంటున్న తీరు చూసి జనం సైతం నివ్వెరపోతున్నారన్నారు. తగుదునమ్మా అంటూ పరామర్శ పేరుతో టంగుటూరు వచ్చి ప్రభుత్వంపై బురద జల్లడం అనితకు సరికాదన్నారు. హనుమాయమ్మ కుటుంబానికి ప్రభుత్వం పూర్తిగా అండగా ఉంటుందని, ఇందులో ఏమాత్రం సందేహం లేదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించే ఏ పథకం అయినా రాజకీయాలకు, మతాలకు, కులాలకు అతీతంగా చేస్తున్నారన్నారు. చంద్రబాబు 14 ఏళ్ల ముఖ్యమంత్రి పాలనలో ఒక్కసారి అయినా కనీసం రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా అందించలేదని, కానీ నేడు కోటి రూపాయలు ఇవ్వాలంటూ డిమాండ్ చేయడం వెనుక చంద్రబాబు నీచ రాజకీయం బయటపడుతుందని విమర్శించారు. కుటుంబ వివాదాలను రాజకీయం చేయడం రాజకీయ నేతలకు తగదని, ఇలాగే జరిగితే వచ్చే ఎన్నికల్లో ప్రతిపక్ష హోదా కూడా ఉండదని వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు తమ్మినేని మాధవి అన్నారు. తమ మండలంలో మరుగుదొడ్లు ఎక్కువగా మంజూరైంది దళితులకే అని, అటువంటి పేద ప్రజానీకానికి దక్కాల్సిన మరుగుదొడ్ల నిధులను సైతం మింగి నేడు అవినీతిని తప్పించుకునేందుకు విషయాన్ని పక్కదారి పట్టిస్తున్న డోలా బాలవీరాంజనేయస్వామిని భవిష్యత్తులో గెలిపించుకునే పరిస్థితి ఉండదని టంగుటూరు మండలం ఆలకూరపాడు సర్పంచ్ ఝాన్సీరాణి విమర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జి బడుగు ఇందిర, మహిళా నాయకురాళ్లు చింతగుంట్ల సువర్ణ, లీలాకుమారి, తూము పద్మ పాల్గొన్నారు.

# అన్ని వర్గాల అభ్యున్నతే ధ్యేయం



పుల్లలచెరువులో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ లబ్ధిని వివరిస్తున్న మంత్రి సురేష్

- చంద్రబాబుకు ఓటమి భయం పట్టుకుంది
- మంత్రి ఆదిమూలపు సురేష్

పుల్లలచెరువు: రాష్ట్రంలో కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని సచివాలయం-1 పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రి సురేష్ పాల్గొని ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ లబ్ధిపొందిన వారికి బుక్‌లెట్‌లు అందజేశారు. అనంతరం మంత్రి సురేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు సకాలంలో సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని అన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని అభివృద్ధి పనులతో పాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నాలుగేళ్ల పాలనలో 95 శాతానికి పైగా నెరవేర్చారని కొనియాడారు. వీటితో పాటు విద్య, వైద్య రంగానికి ప్రాధాన్యత కల్పిస్తూ పెద్ద పీటవేస్తున్నారన్నారు. నాడు-నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలను అన్ని హంగులతో నిర్మించి, మెరుగైన సేవలు అందిస్తున్నారని చెప్పారు. అర్హత ఉండి కూడా ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు అందకపోతే వెంటనే సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

**చంద్రబాబుకు ఓటమి భయం పట్టుకుంది**

వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి నాలుగేళ్లుగా దక్కుతున్న ప్రజాదరణ చూసి ప్రతిపక్ష నాయకులు ఓర్వలేక పోతున్నారని మంత్రి ధ్వజమెత్తారు. ప్రతి సమావేశంలో 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉందని చెప్పుకునే మాజీ సీఎం చంద్రబాబుకు రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాలను చూసి చంద్రబాబుకు భయం పట్టుకుందని ఎద్దేవా చేశారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కూడా జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం గా చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఇటీవల కాలంలో రాష్ట్రంలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రకటిస్తూ తీసుకున్న నిర్ణయంతో ఎందరో జీవితాల్లో వెలుగులు నింపారని అన్నారు. అనంతరం ప్రజలు అడిగిన సిమెంట్ రహదారి, మంచినీటి సౌకర్యానికి సంబంధించిన పలు సమస్యలపై మంత్రి సురేష్ స్పందిస్తూ వాటిని మంజూరు చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ రెంటపల్లి సుబ్బారెడ్డి, సర్పంచ్ ఓబులేసు, ఎంపీటీసీ రాములు, తహశీల్దార్ దాసు, ఏడీఏ నీరజ, ఎంఈవో శామ్యూల్‌జాన్, ఇన్‌చార్జ్ ఎంపీడీవో మరియదాసు, ఈవోఆర్డీ బాలునాయక్, పీఏసీఎస్ చైర్మన్ గాలిరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ జానకిరఘు, సచివాలయ మండల కన్వీనర్ డి.వెంకటేశ్వర్లు, నాయకులు కాశయ్య, గొడుగు ఆంజనేయులు, ఆకుల వెంకటేశ్వర్లు, కేశవనారాయణరెడ్డి, ప్రసాద్, ఈశ్వరరెడ్డి, దానియేలు తదితరులు పాల్గొన్నారు.

# పొగాకు రైతు 'ధర'హాసం

- టంగుటూరు వేలం కేంద్రంలో పొగాకు అత్యధిక ధర రూ.243

టంగుటూరు: పొగాకు ధరలు పైపైకి దూసుకుపోతున్నాయి. నాణ్యమైన పొగాకు కొనేందుకు వ్యాపారులు పోటీపడుతుండటంతో అత్యధిక ధర పలుకుతోంది. స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శనివారం నిర్వహించిన వేలంలో పొగాకు అత్యధిక ధర రూ. 243 వ్యాపారులు పోటా పోటీగా కొనుగోలు చేశారు. ఇది రీజియన్‌లోని అన్ని వేలం కేంద్రాల కన్నా అధికంగా నమోదైంది. కె.ఉప్పలపాడు గ్రామానికి చెందిన రైతులు 856 బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 840 కొనుగోలు చేశారు. 16 పొగాకు బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. గరిష్ట ధర రూ.243 కాగా, కనిష్ట ధర రూ.160 పలకగా, సరాసరి రూ.231. 08 ధర పలికింది. ఈ వేలంలో మొత్తం 28 మంది పాల్గొన్నారని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

**కొండపిలో అత్యధిక ధర రూ. 241**

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో వేలంకేంద్రం అధికారి ఎస్.రామారావు నిర్వహించిన పొగాకు వేలంలో పొగాకు అత్యధిక ధర కేజీ రూ.241 పలికింది. కామేపల్లి, పచ్చవ గ్రామాల నుంచి పొగాకు రైతులు వేలానికి శనివారం 887 బేళ్లు తెచ్చారు. వ్యాపారులు 836 బేళ్లు కొనుగోలు చేసి వివిధ కారణాలతో 38 బేళ్లు తిరస్కరించారు. పొగాకు అత్యధిక ధర కేజీ రూ.241 పలకగా అత్యల్ప ధర కేజీ రూ.150 పలికి సరాసరి ధర కేజీ రూ.227.79 రైతులకు దక్కింది. కాగా రూ.241 అత్యధిక ధరతో పొగాకును డెక్కన్ కంపెనీ, సూర్య ఎంటర్‌ప్రైజెస్, షేక్ మస్తాన్‌సాహెబ్ కంపెనీలు కొనుగోలు చేసినట్లు ఎస్.రామారావు తెలిపారు.

**పొగాకు అత్యధిక ధర రూ.242**

కందుకూరు: పొగాకు వేలంలో రికార్డు ధరలు నమోదవుతూనే ఉన్నాయి. వరుసగా రెండో రోజు రికార్డు స్థాయిలో ధరలు వచ్చాయి. శనివారం వేలంలో ఏకంగా కేజీ పొగాకు రూ.242 పలకింది. కందుకూరు-1 వేలం కేంద్రంలో 578 బేళ్లు వేలానికి ఉంచగా 518 బేళ్లు, కందుకూరు-2 వేలం కేంద్రంలో 834 బేళ్లు ఉంచగా 747 బేళ్లు అమ్ముడుపోయాయి. ఒకటో వేలం కేంద్రంలో అత్యధిక ధర రూ.242 రాగా, రెండో వేలం కేంద్రంలో రూ.240 పలికింది. శుక్రవారం వేలంలో రూ.227 ఉన్న కేజీ పొగాకు శనివారం మరోసారి రూ.15 ధరలు పెరగడం గమనార్హం. వరుసగా ఈ స్థాయిలో ధరలు పెరగడంతో రైతులకు లాభాల పంట పండుతోంది. ఈ ధరల పెరుగుదలతో గతంలో ఎన్నడూ లేని విధంగా సరాసరి ధర రూ.228 రావడం మరో రికార్డు.



టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న నిర్వహణాధికారి శ్రీనివాసరావు

## క్లుప్తంగా

### మల్లాలమ్మ విగ్రహం ధ్వంసం


ధ్వంసమైన మల్లాలమ్మ విగ్రహం

కొమరోలు: మండలంలోని పుల్లారెడ్డిపల్లె గ్రామ సమీపంలో చెరువుకట్టపై వెలసిన మల్లాలమ్మ విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు శనివారం తెల్లవారుజామున ధ్వంసం చేశారు. నిరంతరం పూజలు అందుకుంటున్న మల్లాలమ్మ విగ్రహంపై భాగాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంతో పెద్ద సంఖ్యలో గ్రామస్తులు అక్కడికి చేరుకున్నారు. ఆకతాయిలు చేసిన పనిగా గ్రామస్తులు భావిస్తున్నారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని గ్రామపెద్దలు తెలిపారు. కాగా, ఇంకా ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై సుబ్బరాజు తెలిపారు.

# సముద్రంలో గల్లంతై ఇద్దరు మృతి

- కొత్తపట్నం మండలం ఈతముక్కల తీరంలో ఘటన
- మృతులిద్దరూ ఒంగోలుకు చెందిన స్నేహితులు


సుదర్శన్ (ఫైల్ ఫొటో)


జేసుదాస్ (ఫైల్ ఫొటో)


జేసుదాస్, సుదర్శన్ మృతదేహాలు

కొత్తపట్నం: సముద్రంలో ఇద్దరు యువకులు గల్లంతై మృత్యువాతపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఒంగోలు నగరం విజయనగర కాలనీకి చెందిన పాలేటి సుదర్శన్ (22), దేవుడు చెరువు కాలనీకి చెందిన అంగలకుర్తి జేసుదాస్ (21) జేఎంజేలో ఇంటర్‌నెట్ కనెక్షన్లు ఇస్తుంటారు. వీరిద్దరూ ఒంగోలు నగరం శివాలయం దగ్గరలో ఉంటున్న వల్లెపు శశికుమార్‌తో కలిసి శనివారం కొత్తపట్నం మండలం ఈతముక్కల గ్రామం చెంచుపాపాయిపాలెం దగ్గర సముద్ర తీరానికి చేరుకున్నారు. వారు తెచ్చుకున్న తినుబండారాలు తిన్నారు. అనంతరం సుదర్శన్, జేసుదాస్ సముద్రంలో స్నానానికి దిగారు. శశికుమార్ మాత్రం ఒడ్డునే కూర్చుని దాహం వేయడంతో చెంచుపాపాయిపాలెం వెళ్లి మంచినీరు తీసుకొచ్చాడు. అప్పటికే పాలేటి సుదర్శన్, అంగలకుర్తి జేసుదాస్ సముద్రంలో మునిగిపోతున్నామని చేతులు పైకెత్తి కేకలు వేస్తున్నారు. తన స్నేహితులు మునిగిపోతున్నారని, కాపాడాలని శశికుమార్ పెద్దగా కేకలు వేస్తూ మత్స్యకారుల దగ్గరకు వెళ్లాడు. అక్కడే ఉన్న మత్స్యకారులు చూసి ఒడ్డుకు చేర్చారు. హుటాహుటిన ఈతముక్కల హాస్పిటల్‌కు తీసుకెళ్లగా, అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్ నిర్ధారించారు. విషయం తెలుసుకున్న ఎస్సై సాంబశివరావు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాలను ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

**తల్లడిల్లిన తల్లి మనసులు**

ఒంగోలు టౌన్: సుదర్శన్, జేసుదాస్ మంచి స్నేహితులు. ఇద్దరి తండ్రులు చనిపోయారు. దాంతో ఇంటి బాధ్యతలు నెత్తినేసుకుని చిరుద్యోగాలు చేస్తున్నారు. వేసవి కాలం ఎండలు మండిపోతుండటంతో కాసేపు సేద తీరేందుకు ఈతకు వెళ్లి మృతిచెందడంతో చేతికందివచ్చిన బిడ్డలను విగత జీవులుగా చూసి వారి తల్లులు గుండెలు బాదుకుని రోదించారు.

**చదువుకుంటూనే ఉద్యోగం చేస్తూ...**

జేసుదాసు ఒంగోలులోని ఓ డిగ్రీ కాలేజీలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. తండ్రి రాజు ఏడేళ్ల క్రితం మరణించాడు. ఒక అక్క, ఒక చెల్లితో పాటు తల్లి మణికుమారితో కలిసి జీవిస్తున్నాడు. బతుకు బండి నడిపే బాధ్యత జేసుదాసుదే కావడంతో స్థానికంగా ఒక ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్నాడు. అక్కడే పరిచయమైన సుదర్శన్ కొద్ది రోజుల్లోనే మంచి దోస్తు అయ్యాడు. ఎక్కడికెళ్లినా ఇద్దరూ కలిసే వెళ్లేవాళ్లు. అలాగే ఈతకు కూడా వెళ్లారు. చివరి ప్రయాణంలో కూడా ఇద్దరూ కలిసే వీడ్కోలు తీసుకున్నారు. ఇంట్లో అందరికీ తలలో నాలికలా మసలే జేసుదాసు మరణంతో ఆ తల్లి గుండెలు పగిలినట్లు రోదిస్తుంది. ఇద్దరు సోదరీమణులను ఓదార్చడం ఎవరి తరమూ కాలేదు.

**ఇంటర్ చదువుకుని...**

సుదర్శన్ ఇంటర్ వరకు చదువుకున్నాడు. తండ్రి సుబ్బారావు చనిపోయి ఉన్నారు. తల్లి వెంకటరత్నం గృహిణి. ఇద్దరు సంతానంలో పెద్దకుమారుడు సురేష్‌కు వివాహమైంది. అందరూ కలిసే ఒకే ఇంట్లో జీవిస్తున్నారు. చిరుద్యోగి అయిన అన్నకు తోడుగా నిలవాలని తానూ ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగానికి చేరాడు. స్నేహితుడు జేసుదాసుతో కలిసి ఈతకు వెళ్లాడు. దురదృష్టవశాత్తూ నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయాడు. సుదర్శన్ మృతితో ఆ కుటుంబం శోకంలో మునిగిపోయింది. మృతుల బంధువుల రోదనలతో ఒంగోలు రిమ్స్ శోకసంద్రంగా మారింది. జేసుదాసు, సుదర్శన్‌ల మిత్రులు అక్కడికి చేరుకుని కన్నీరుమున్నీరవుతున్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


మృతి చెందిన నరసింహులు

రాచర్ల: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన రాచర్ల గ్రామ సమీపంలోని మోడల్ స్కూల్ వద్ద శనివారం రాత్రి 9 గంటల సమయంలో చోటుచేసుకుంది. గిద్దలూరు మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన దేవరకొండ నరసింహులు (35) మోటార్ సైకిల్‌పై రాచర్ల నుంచి కొత్తపల్లి వెళ్తుండగా, గిద్దలూరు నుంచి రాచర్ల వెళ్తున్న బొలెరో వాహనం ఢీకొట్టింది. దీంతో నరసింహులు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వి.మహేష్ తెలిపారు.

## రైతాంగానికి బీజేపీ ద్రోహం

ఒంగోలు టౌన్: భారత రైతాంగానికి బీజేపీ ప్రభుత్వం తీరని ద్రోహం చేసిందని ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని అధికారంలోకి వచ్చిన మోదీ సర్కార్.. ఆ తర్వాత కార్పొరేట్లకు లబ్ధిచేకూర్చే విధానాలకు పాల్పడుతూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయకుండా వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెడుతోందన్నారు. సిఫార్సుల మేరకు సీ2 ప్లస్ 50 శాతం మద్దతు ధర ఇవ్వని పక్షంలో రైతులు వ్యవసాయం చేయలేరని స్పష్టం చేశారు. వ్యవసాయాన్ని కార్పొరేట్లకు అప్పగించేందుకు చేసిన కుట్రను ఉద్యమం ద్వారా రైతు సంఘాలు తిప్పికొట్టాయన్నారు. ఇదే స్ఫూర్తితో రానున్న రోజుల్లో రైతాంగం ఉద్యమాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

# సీఎం జగన్‌తోనే సంక్షేమ పాలన

- గొడ్రాలికొండ తిరుమలనాథుని బ్రహ్మోత్సవాల్లో మంత్రి ఆదిమూలపు సురేష్


రాజంపల్లి ప్రభపై నుంచి మాట్లాడుతున్న మంత్రి సురేష్

పెద్దారవీడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే రాష్ట్రంలో సంక్షేమ పాలన సాధ్యమని రాష్ట్ర పురపాలక శాఖామంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. మండలంలోని రాజంపల్లిలో గొడ్రాలికొండ తిరుమలనాథుని బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం రాత్రి మంత్రి పాల్గొన్నారు. ముందుగా స్వామివారిని దర్శించుకుని భవానీప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన ప్రభపై మంత్రి సురేష్ మాట్లాడారు. రాష్ట్రంలో సుస్థిర పాలన ఒక్క జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని అన్నారు. గత టీడీపీ పాలనలో బడుగు, బలహీనవర్గాల వారు అట్టడుగు స్థాయిలోనే ఉండేవారన్నారు. అటువంటి వారి జీవితాల్లో వెలుగులు నింపిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పేద, మధ్య తరగతి వర్గాల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలను సీఎం జగన్ అమలు చేస్తున్నారని తెలిపారు. అన్నివర్గాల ప్రజలు సంతోషంగా ఉండాలనే లక్ష్యంతో పరిపాలన సాగుతోందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నవరత్నాల పథకాల ద్వారా నూరు శాతం అమలు చేశారని వివరించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సంక్షేమ పథకాలు అందజేస్తూ జనరంజక పాలన సాగిస్తున్నారని తెలిపారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలు ఏర్పాటు చేసి ప్రజల వద్దకు పాలన తీసుకొచ్చినట్లు తెలిపారు. కులం, మతం, పార్టీ అనే భేదాలు చూడకుండా అర్హతే ప్రమాణికంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు ఏర్పాటు చేసి పచ్చ చొక్కా వేసుకున్న వారికే పథకాలు అందజేసి దోచుకో, దాచుకో అనే విధంగా పరిపాలన సాగిందని మంత్రి సురేష్ ఎద్దేవా చేశారు. నేడు అదే టీడీపీ వారు అభద్రతాభావంతో పాదయాత్రలు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలోని ప్రతిపక్షాలన్నింటికీ 175 స్థానాల్లో పోటీ చేసే దమ్ముందా అని మంత్రి సురేష్ ప్రశ్నించారు. ఎవరితో పొత్తు లేకుండా అన్నీ స్థానాల్లో పోటీ చేసే పార్టీ ఒక్క వైఎస్సార్ సీపీనే అని అన్నారు. ప్రతిపక్ష పార్టీలన్నీ కలిసి వచ్చినా మళ్లీ జగనన్న ముఖ్యమంత్రిని చేసేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు పన్నినా నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. అసలు టీడీపీకి ఓటు ఎందుకు వేయాలని మంత్రి సురేష్ ప్రశ్నించారు. ఒక పార్టీ అధినేత రాష్ట్రంలో రెండు చోట్ల పోటీ చేసి ఒక్క స్థానంలో కూడా గెలవకుండా సీఎం జగనన్నను విమర్శించడం విడ్డూరంగా ఉందని, ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. అభివృద్ధి, సంక్షేమం కేవలం జగనన్నకే సాధ్యమన్నారు. వెలిగొండ ప్రాజెక్టు ముంపు గ్రామ నిర్వాసితులకు ఆర్‌ఆర్ ప్యాకేజీ ద్వారా రూ.12.50 లక్షలు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రాష్ట్రంలో మూడు లక్షల ఎకరాల చుక్కల భూముల సమస్యను పరిష్కరించి రైతులకు ఎంతో మేలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందన్నారు. జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలంతా ఒక సైన్యంలా పనిచేయాలన్నారు. అనంతరం మంత్రి సురేష్‌ను కార్యకర్తలు సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఏర్వ అల్లూరమ్మ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాలిరెడ్డి కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ ఏర్వ చలమారెడ్డి, ఎంపీపీ బెజవాడ పెద్దగురవయ్య, ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ డి.వెంకటరెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రంగంలోకి నాలుగు ప్రత్యేక బృందాలు

- మార్కాపురం దొంగతనం కేసులో దర్యాప్తులో దూకుడు

మార్కాపురం: ఈ నెల 5న పట్టణంలోని జవహర్ నగర్ కాలనీలో విశ్రాంత వయోజన విద్య జాయింట్ డైరెక్టర్ వీరారెడ్డి ఇంట్లో దొంగతనం జరిగిన విషయం విదితమే. ఈ క్రమంలో కేసు ఛేదించేందుకు నాలుగు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. సుమారు 52 తులాల బంగారు ఆభరణాలు పోయినట్లు ఫిర్యాదు అందింది. వీరారెడ్డి కుమారుడు రాకేష్‌రెడ్డి ప్రస్తుతం అసోం రాష్ట్రంలోని గోల్పర ఎస్పీగా పని చేస్తున్నారు. దీంతో ప్రకాశం ఎస్పీ మలిక గర్గ్ స్థానిక పోలీసు అధికారులతో దొంగతనంపై సమీక్షించి త్వరగా నిందితులను పట్టుకోవాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతంలో ఉన్న సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. పాత నేరస్తుల కదలికలపై కూడా దృష్టి సారించారు. దొంగతనం కేసులో నిందితులను పట్టుకునేందుకు రాష్ట్రంలో వివిధ ప్రాంతాలకు తమ సిబ్బంది వెళ్ళినట్లు పట్టణ ఎస్‌ఐ శశికుమార్ తెలిపారు.

## మనస్తాపంతో యువకుడు బలవన్మరణం


టంగుటూరులో మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై ఖాదర్ బాషా

టంగుటూరు: భార్య, భర్తల మధ్య గొడవలతో యువకుడు మనస్తాపం చెంది ఉరివేసుకొని మృతి చెందిన సంఘటన టంగుటూరులోని చెల్లెమ్మ తోటలో శుక్రవారం రాత్రి చేసుకోగా, ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జరుగుమల్లి గ్రామానికి చెందిన నిడమానూరు కుమార్ (33) చెల్లెమ్మ తోటలో తన కుంటుంబంతో సహ గత 30 సంవత్సరాలుగా నివాసం ఉంటున్నాడు. కాగా హైదరాబాదులో ఫార్మసీ కంపెనీలో ఉద్యోగం చేస్తుండగా.. ఏడు సంవత్సరాల క్రితం ఒంగోలు శివప్రసాద్ కాలనీకి చెందిన అమల అనే యువతితో వివాహం జరిగింది. వీరికి అమ్మాయి, అబ్బాయి ఉన్నారు. అయితే కుమార్ మద్యానికి బానిసై హైదరాబాద్‌లోని ఫార్మా కంపెనీలో ఉద్యోగం మానేసి వచ్చి కొంతకాలం ఒంగోలు అత్తగారి ఇంట్లో ఉండి మద్దలూరు మున్నంగి ఫ్యాక్టరీలో పని చేస్తున్నాడు. భార్యతో గొడవలు పడుతూ ఉండటంతో ఇటీవల టంగుటూరు చేరుకున్నాడు. ఈ క్రమంలోనే అతని భార్య పది రోజుల క్రితం ఒంగోలు తాలూకా పోలీసు స్టేషన్లో 498ఏ కేసు పెట్టింది. కాగా మనస్తాపంతో అతిగా తాగుతూ శుక్రవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని చనిపోయాడు. ఆలస్యంగా తెలుసుకున్న కుమార్ తండ్రి పోలీసులకు సమాచారం అందించటంతో సంఘటనా స్థలాన్ని ఎస్సై ఖాదర్ బాషా, సిబ్బందితో మృతదేహాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## గుర్తు తెలియని వాహనం ఢీ.. వ్యక్తి మృతి


ప్రమాద స్థలంలో మృతిచెందిన ఏసు


పొన్నలూరు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రమేష్

పొదిలి రూరల్: గుర్తు తెలియని వాహనం ఢీ కొని ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన శనివారం పొదిలి మండలం కుంచేపల్లి పరిధిలోని ఉన్నగురువాయుపాలెం దగ్గర పొదిలి–దర్శి రోడ్డుపై జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. కుంచేపల్లి ఎస్సీ కాలనీకి చెందిన తాళ్లూరి ఏసు (62) తన ద్విచక్ర వాహనంపై ఉదయాన్నే బస్ వేసుకోవడానికి కుంచేపల్లి నుంచి దర్శికి వెళుతున్నాడు. దర్శి నుంచి పొదిలి వైపు వెళుతున్న బొలేరో వాహనం మార్గ మధ్యంలోని ఉన్న గురువాయుపాలెం దగ్గర ఢీ కొట్టింది. ఏసు తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అతనికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుటుంబానికి పెద్ద దిక్కు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు. మృతదేహాన్ని పొదిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

**రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి**

పొన్నలూరు: ద్విచక్రవాహనం అదుపుతప్పి వంతెన ఢీకొట్టి కింద పడిపోవడంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన పొన్నలూరు పొలిమేర దగ్గర శుక్రవారం జరగగా శనివారం సాయంత్రం వెలుగులోకి వచ్చింది. పొన్నలూరు గ్రామానికి చెందిన కుంచాల రమేష్ (32) కూలీ పనులు చేసుకుంటు జీవనం కొనసాగిస్తున్నాడు. ప్రస్తుతం మామిడి కాయల సీజన్ కావడంతో నెల రోజుల నుంచి శింగరబొట్లపాలెం అడ్డ రోడ్డుకు సమీపంలోని ఓవీ రోడ్డు పక్కన మామిడి కాయలు పెట్టుకొని అమ్ముకుంటున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం భార్య లక్ష్మీకాంతానికి.. కందుకూరు వెళ్లి వస్తానని చెప్పి..తన ద్విచక్ర వాహనంపై ఇంట్లో నుంచి బయలుదేరాడు. కందుకూరు వెళ్లి పని ముగించుకొని వచ్చే క్రమంలో పొన్నలూరు పొలిమేర వద్దకు రాగానే ద్విచక్ర వాహనం అదుపుతప్పి పక్కనే ఉన్న వంతెన దిమ్మెలను ఢీకొట్టి కిందపడిపోయాడు. రమేష్ తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే చనిపోయాడు. కింద గుంటలో ఎవరూ గమనించకపోవడంతో శనివారం సాయంత్రం దుర్వాసన వెదజల్లింది. ప్రయాణికులు గమనించి పోలీసులకు సమాచారం అందించగా వారు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దాసరి రాజారావు తెలిపారు.

## రేపు పేస్‌లో ప్రాంగణ ఎంపికలు

ఒంగోలు: స్థానిక పేస్ ఇంజినీరింగ్ కాలేజీలో సోమవారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించనున్నట్లు కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ తెలిపారు. 2022–23 బ్యాచ్‌కు చెందిన డిగ్రీ, ఇంజినీరింగ్ విద్యార్థులు హాజరై సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు నేరుగా రెజ్యూమ్‌తో హాజరుకావాలన్నారు. పూర్తి వివరాలకు సెల్ నంబర్ 6281432728ను సంప్రదించాలని సూచించారు.